క్లుప్తంగా

బీసీ హాస్టల్ నిర్మాణానికి స్థలం అప్పగింత



స్థలం పత్రాలను అందజేస్తున్న తహసీల్దార్ బాలలక్ష్మి

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రానికి గతంలో బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల మంజూరవ్వగా.. భవనం లేకపోవడంతో తాత్కాలికంగా తూప్రాన్‌లో ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం పాఠశాలకు సంబంధించి తరగతులు తూప్రాన్‌లోనే కొనసాగుతున్నాయి. కాగా, మండల కేంద్రంలో భవనం నిర్మాణం, బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి గ్రామ శివారులోని సర్వే నంబర్ 1231లో ఎనిమిది ఎకరాలు కేటాయించారు. అయితే భూమికి సంబంధించి గతంలోనే కొలతలు పూర్తి చేసి హద్దులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే సోమవారం పాఠశాలకు కేటాయించిన భూమిని కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ గౌతమ్‌రెడ్డికి అప్పగించారు. అనంతరం హద్దులు చూయించడంతో పాటు సంబంధిత పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలలక్ష్మి, గిర్దవర్ నర్సింగ్ యాదవ్, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న మాలల హక్కుల సాధన సమితి నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగిలో మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మైసయ్య కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ గ్రేసిబాయి, ఎంపీడీఓ ఆనంద్‌కుమార్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కందరి శ్రీనివాస్, బాల ఎల్లం, మల్లేషం పాల్గొన్నారు.

పంచాయతీ భవనం రెడీ



ప్రారంభానికి సిద్ధమైన శమ్నాపూర్ పంచాయతీ భవనం

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని శమ్నాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం ప్రారంభానికి సిద్ధమైంది. గతంలో ఉన్న పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకోగా.. కార్యాలయ భవనం కోసం ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.20లక్షలతో భవన నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణం పనులు పూర్తికావడంతో ప్రారంభానికి ముహూర్తం ఖరారు చేసి ప్రారంభించనున్నారు. శాశ్వత భవనం లేకపోవడంతో స్కూల్ పక్కనే ఉన్న భవనంలోనే కొనసాగిస్తున్నారు. ఈ భవనం ప్రారంభమైతే ఇబ్బందులు తీరనున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

వైభవంగా కలశస్థాపన



కలశస్థాపనలో చైర్మన్, డైరెక్టర్లు

నిజాంపేట(మెదక్): మండలంలోని చల్మెడ గ్రామశివారులో ఉన్న తిరుమలనాథ స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గామాత కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది దుర్గామాత నవరాత్రుల సందర్భంగా మొదటి రోజు కలశస్థాపన నిర్వహిస్తామని పౌరోహితులు వెంకటరమణ శర్మ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు బాజ రమేశ్, రాజయ్య, నారాయణ పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలకు దరఖాస్తుల ఆహ్వానం

హవేళిఘణాపూర్(మెదక్): మండలంలోని ఆయా కులాలకు చెందిన అర్హత ఉన్న రైతులు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు పొందేందుకు ఏఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఏఓ బాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్స్, పవర్ స్ప్రేయర్స్, రోటవేటర్స్, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్ వంటి వాటి కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. అర్హత గల రైతులు ఈ నెల 29లోగా రైతులు ఆధార్‌కార్డు, పట్టాపాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్, రెండు పాస్‌ఫొటోలు జత చేసి హవేళిఘణాపూర్ రైతువేదికలో సమర్పించాలని కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా మహిళలు బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ దేవాలయాల్లో, గ్రామాల్లో పాటలు పాడుతూ సందడి చేశారు. రెండో రోజు అటుకుల బతుకమ్మ సందర్భంగా రంగురంగుల పూలను పేర్చి ఆడి పాడారు. ఇందులో భాగంగానే సప్పిడి పప్పు, బెల్లం, అటుకులు నైవేద్యంగా సమర్పించారు. ఈ వేడుకల్లో మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం చెరువులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



శివ్వంపేట: బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు



నర్సాపూర్: లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కొడిపల్లి: బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఉన్నత విద్య, ఉద్యోగాల కల్పనే ధ్యేయం



జపాన్ యూనివర్సిటీతో చేసుకున్న ఒప్పందం పత్రాలను చూపుతున్న విష్ణు సొసైటీ చైర్మన్, జపాన్ యూనివర్సిటీ ప్రతినిధులు

నర్సాపూర్: విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రధాన ధ్యేయమని విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ విష్ణురాజు చెప్పారు. ఈ మేరకు సోమవారం స్థానిక బీవీఆర్‌ఐటీ కాలేజీ జపాన్‌కు చెందిన సాగ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇంజనీరింగ్ కాలేజీల్లో ఉత్తమ విద్యను అందిస్తున్నందున విదేశీ యూనివర్సిటీలు తమ కాలేజీలకు వస్తున్నాయన్నారు. దేశంలో ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు తమ దేశంలో ఇంటర్న్‌షిప్ విద్య, ఉపాధి అవకాశాలు పొందవచ్చని జపాన్‌కు చెందిన సాగ యూనివర్సిటీ ప్రొఫెసర్ యుకియో నాగనో, స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ డీన్ అకిహిరో సుజుకిలు చెప్పారు. అనంతరం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి సొసైటీ చైర్మన్, జపాన్ యూనివర్సిటీ ప్రతినిధులు ఒకరికొకరు అందజేసుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ రాజగోపాలన్, కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్ దూబె, ప్రతినిధులు రమేష్, సతీష్‌చంద్ర, రాజు, రవికిరణ్, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలు అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతుందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్‌లు అందించామన్నారు. కానీ ప్రస్తుత ఎమ్మెల్యే వివక్ష చూపడంతో పాటు ప్రభుత్వ పథకాలను అందించకుండా అడ్డుపడుతున్నారన్నారు. మండలానికి చెందిన సుమలతకు 2017లో వివాహం జరగగా.. తాను ఉద్దేశపూర్వకంగా కల్యాణలక్ష్మి చెక్కు ఇవ్వలేదని అసత్యపు ఆరోపణలు చేస్తున్నారన్నారు. అయితే వాస్తవానికి ఆమె భర్త నాలుగు వివాహాలు చేసుకున్నట్లు అధికారులు గుర్తించి చెక్కు మంజూరు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, రమేష్, దత్తు, మానిక్‌రెడ్డి, సుభాష్, యాకుబ్, శంకర్‌గౌడ్, అశోక్, అంజయ్య, గోపాల్, యాదుల్, సాయిలు తదితరులున్నారు.

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి



పొలాన్ని సందర్శించిన శాస్త్రవేత్త లక్ష్మీప్రసన్న

వెల్దుర్తి(తూప్రాన్): నాణ్యమైన విత్తనాలు, ఎరువులతోనే అధిక దిగుబడి సాధ్యమని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త లక్ష్మీప్రసన్న అన్నారు. ఈ సందర్భంగా వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లో యూనివర్సిటీ ద్వారా విత్తనాలు అందించి సాగుచేస్తున్న ఎంటీయూ 1010 రకం వరి పంటను సోమవారం ఆమె సందర్శించారు. అనంతరం రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనాలు అందజేశామన్నారు. కావున నాణ్యమైన విత్తనం పొందిన రైతులు తిరిగి ఆయా పంటల్లో పండిన విత్తనాలను తోటి రైతాంగానికి తక్కువ ధరలో అందజేస్తే రైతులందరికి నాణ్యమైన విత్తనం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఝాన్సీ, ఏఈఓ రజిత, రైతులు పాల్గొన్నారు.

సరస్వతి మాతకు నగల ధగధగ



వర్గల్(గజ్వేల్): చదువుల తల్లి వర్గల్ శ్రీవిద్యా సరస్వతీదేవి బంగారు తాపడం నగలు, కవచాల తో ధగధగలాడనున్నది. సోమవారం ఓ అజ్ఞాతభక్తుడు వెండితో కవచాలు, ఆభరణాలను తయారుచేయించి, బంగారు తాపడం చేయించి ఆలయంలో అందజేశారు. శరన్నవరాత్రోత్సవాల ఆయా ఆభరణాలకు శ్రీమధుసూదనానంద సరస్వతి ప్రత్యేక పూజలు జరిపి, అమ్మవారికి సమర్పించారు.

భారీ వర్షం



హవేళిఘణాపూర్‌లో రోడ్డుపై నిలిచిన నీరు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. గత కొంతకాలంగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని అన్ని చెరువులు, కుంటల్లో నీరు చేరి అలుగులు పారుతోంది.

జలమయమైన రోడ్లు

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రంతో పాటు తొగిట, చౌట్లపల్లి, కూచన్‌పల్లి, ముత్తాయిపల్లి గ్రామాల్లో భారీగా వర్షం కురిసింది. సోమవారం దాదాపు గంటపాటు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి రోడ్లు జలమయంగా మారాయి.



పెద్దశంకరంపేటలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

వసతుల కల్పనకు చర్యలు



మున్సిపల్ సిబ్బందితో పరిశీలిస్తున్న కమిషనర్

నర్సాపూర్: బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని మున్సిపాలిటీ పరిధిలో సోమవారం కమిషనర్ రాంచరణ్‌రెడ్డి తన సిబ్బందితో బతుకమ్మ నిర్వహించే ప్రాంతాలు, రాయరావు చెరువు పరిసరాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మలు నిర్వహించే ప్రాంతాలతో పాటు రాయరావు చెరువు ఘాట్ వద్ద వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే వీధి లైట్లు మరిన్ని ఏర్పాటు చేయాలని, మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య పనులు సమర్థవంతంగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పలువురు సిబ్బంది రాములు, ఉదయ్‌కుమార్, భూపాల్, వినీత్, మురళి, విష్ణు తదితరులు ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట గ్రామ ముదిరాజ్ సంఘం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. పెద్దమ్మ తల్లి దేవాలయం ఆవరణలో సమావేశమయ్యారు. అధ్యక్షుడిగా గొండ కృష్ణ, ఉపాధ్యక్షులుగా బొగ్గుల సుదర్శన్, ఉసికె సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



సమావేశమైన గ్రామ సంఘాల ప్రతినిధులు, అధికారులు

బ్యాంకు లింకేజీ లక్ష్యాలను పూర్తి చేయాలి


నర్సాపూర్: గ్రామ మహిళా సంఘాల్లో చేరని మహిళలను గుర్తించి వారిని సంఘాల్లో చేర్పించాలని ఐకేపీ ఏపీఎం సంగమేశ్వర్ సూచించారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సమైఖ్య సమావేశానికి మండల సమాఖ్య అధ్యక్షురాలు సుమలత అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శక్తి పథకంలో భాగంగా గ్రామాలలో కిశోర బాలికలు, దివ్యాంగులు, వృద్ధులు తదితరులతో సాధారణ సంఘాలు ఏర్పాటు చేయాలని కోరారు. బ్యాంకు లింకేజీని లక్ష్యం మేరకు పూర్తి చేయాలని, మొండి బకాయిలు రికవరీ చేపట్టాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మి, సరస్వతి, కవితలు మహిళలు, పిల్లల ఆరోగ్యంపై పోషణ ఆహారంపై వివరించారు. ఈ మేరకు రెడ్డిపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం బతుకమ్మలు పేర్చి కార్యాలయం ఎదుట బతుకమ్మ ఆడారు. కాగా, పోషణ అభియాన్‌లో భాగంగా బియ్యం, పప్పు, పలు రకాల ఆకులతో జాతీయ జెండా తయారు చేసి దాని పక్కన బతుకమ్మలు పెట్టి ఆడిపాడారు.

బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు

జిల్లావ్యాప్తంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం పలు ఆలయాల్లో దేవీనవరాత్రులు నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా చుట్టూ పక్కల గ్రామాల భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారికి ఒడిబియ్యం, చీరలు సమర్పించారు.



పెద్దశంకరంపేట: దుర్గమ్మ ఆలయంలో బాలత్రిపురసుందరిగా అమ్మవారు



తూప్రాన్‌లో ప్రత్యేక అలంకరణలో దుర్గామాత



బొడ్మట్‌పల్లిలో కొలువుదీరిన అమ్మవారు

పౌష్టికాహారంపై అవగాహన తప్పనిసరి

పెద్దశంకరంపేట(మెదక్): పౌష్టికాహారంపై మహిళలు అవగాహన పెంచుకోవాలని వైద్యాధికారి షరీఫొద్దిన్, సీడీపీఓ పద్మలత అన్నారు. సోమవారం మండలంలోని పీహెచ్‌సీలో మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాతాశిశు సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు కవిత, సునీల్, సూపర్‌వైజర్ పుష్పలత, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో..

మనోహరాబాద్(తూప్రాన్): మహిళలు పోషకాహారం తీసుకోవాలని తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఐసీడీఎస్, వైద్యుల ఆధ్వర్యంలో పోషణమాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోత్స్నదేవి, ఎంఈఓ మల్లేషం, ఐసీడీఎస్ సూపర్ వైజర్ మెహతాబ్ బేగం, అంగన్‌వాడీ టీచర్లు, మెడికల్ ఆఫీసర్ బాల్‌నర్సయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వెల్దుర్తి: పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ మాధవి

ఆరోగ్య రక్షణే లక్ష్యం

వెల్దుర్తి(తూప్రాన్): పోషకాహారంతోనే ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి అన్నారు. సోమవారం మాసాయిపేట మండలంలోని బొమ్మారం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, గర్భిణులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు.

మహిళల ప్రతిజ్ఞ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మహిళలు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత తెలిపారు. సోమవారం ఐకేపీ మండల సమాఖ్య సమావేశంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. అనంతరం మహిళలతో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్, సీసీలు వెంకటలక్ష్మి, లక్ష్మణ్, విజయలక్ష్మి, పురుషోత్తం, శ్రీకాంత్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్ ప్రశాంతి, ఆయా శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

చేగుంట(తూప్రాన్): గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ అనీల్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషక మాసోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మృదుల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైనీ సువర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మనోహరాబాద్: పోషణ మాసం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



పెద్దశంకరంపేట: పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు